క్లుప్తంగా

రాజంపేట ఘర్షణలో యువకుడికి రిమాండ్



నిందితుడు దుర్గాప్రసాద్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సత్య కిషోర్

సీతానగరం: రాజంపేటలో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణకు సంబంధించి కాటవరానికి చెందిన గాడ దుర్గాప్రసాద్‌కు కోర్టు రిమాండ్ విధించిందని కోరుకొండ సీఐ సత్య కిషోర్ తెలిపారు. అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అతడికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుర్గాప్రసాద్‌పై రౌడీ షీట్ త్వరలో ఓపెన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై డి.రామ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం విద్యుత్ శాఖ ఈఈ దాట్లశ్రీధర్ వర్మ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం బలభద్రపురం, ఇండస్ట్రియల్, కావపరం, గంగులూరు పాకల వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాలుడికి నాణేలతో తులాభారం



చిల్లర నాణేలతో బాలుడికి తులాభారం వేస్తున్న తల్లిదండ్రులు

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. వేకువజాము నుంచి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పలువురు భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. ఒక చిన్నారికి వారి తల్లిదండ్రులు చిల్లర నాణేలు, పటిక బెల్లంతో తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. మధ్యాహ్నం హారతిలోనూ భక్తుల తాకిడి అధికంగా ఉంది.

టీచర్ శిరీషకు సావిత్రీబాయి అవార్డు



పిట్టా శిరీష కుమారి

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా పని చేస్తున్న పిట్టా శిరీష కుమారి.. సావిత్రీ బాయి పూలే అవార్డు 2025కు ఎంపికయ్యారు. విజయవాడ లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్లో శుక్రవారం జరిగే కార్యక్రమంలో ఆమెకు అవార్డు ప్రదానం చేస్తారు. భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించనున్నారు. కాగా.. శిరీష కుమారి 2023లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డును అందుకున్నారు.

రెవెన్యూ సదస్సుకు ఎనిమిది అర్జీలు



పురుషోత్తపట్నంలో అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాస్

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎనిమిది అర్జీలను అధికారులు అందుకున్నారు. కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ల కోసం నాలుగు, భూమి సర్వే కోసం మరో నాలుగు అర్జీలను రైతులు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉండేశ్వరపురంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలపై రైతులు అర్జీలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.రవీంద్ర, సర్వేయర్ గౌతమ్, వీఆర్వో నందీశ్వరరావు, ఎండోమెంట్ ఈవో పాటి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

కంబాలచెరువు: ఏపీటీఎఫ్ నాయకుడు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ పాఠశాలల్లో దాదాపు 36 ఏళ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆకెళ్ల వ్యాఘ్రేశ్వరరావు (63) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. ఆయన మృతికి ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

అభ్యున్నతికి సారాఘాతం

- గ్రామాల్లో విచ్చలవిడిగా సారా తయారీ
- అక్రమార్కుల దందా



తిరుమలాయపాలెంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది స్వాధీనం చేసుకున్న సారా



గోదావరి లంకల్లోని బట్టీలపై దాడులు చేసి, స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు

మధురపూడి: గ్రామాల్లో సారా రక్కసి స్వైర విహారం చేస్తోంది. పేదలు, కష్టజీవులను నాశనం చేస్తోంది. కొందరు అక్రమార్కులు సారా వ్యాపారాన్ని విచ్చలవిడిగా సాగిస్తూ ఆదాయం సంపాదిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతో పలువురు ఈ దందా కొనసాగిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ కోరుకొండ సర్కిల్ పరిధిలోని కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాల్లో 64 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 18 గ్రామాలలో సారా వ్యాపారం జోరుగా సాగుతోందని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు.

సిబ్బంది కొరత

సారాను శాశ్వతంగా నిర్మూలించడానికి కూటమి ప్రభుత్వం నవోదయం అనే కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ఎక్సైజ్ శాఖలో ఖాళీలను పూర్తిచేయకపోవడం, చాలినంతమంది సిబ్బంది లేకపోవడంతో ఈ కార్యక్రమం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతుంది.

సారా స్థావరాలు

సీతానగరం మండలంలోని గోదావరి లంకలు, కోరుకొండ, గోకవరం మండలాల్లోని మారుమూల గ్రామాలు సారా ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయి. గోదావరి లంక గ్రామాలు, మండల శివారు గ్రామాలు, అటవీ ప్రాంతాలు, తోటలు, మెట్ట ప్రాంతాల్లో సారా విచ్చలవిడిగా తయారవుతోంది. గుమ్ములూరు. బుచ్చెంపేట, బొబ్బిల్లంక, ములకల్లంక, తిరుమలాయపాలెం, అచ్యుతాపురం, వెదురుపాక, బొల్లెద్దుపాలెం, కోటికేశవరం, గాదరాడ, కణుపూరు, రాజవరం తదితర గ్రామాలు సారా తయారీకి పేరు పొందాయి.

రవాణా చేసే విధానం

రహస్య ప్రదేశాలు, తోటలు, దట్టమైన ప్రాంతాల్లో సారాను తయారు చేస్తున్నారు. రాత్రి వేళల్లో తయారు చేసిన సారాను అర్ధరాత్రి, తెల్లవారుజాము వేళల్లో రవాణా చేస్తారు. ఉత్పత్తి జరిగిన ప్రదేశాల నుంచి సరిహద్దులు దాటించి రహస్య ప్రాంతాలకు తీసుకువెళతారు. విక్రయదారులు కూడా ఆయా ప్రాంతాలకు వచ్చి కొనుగోలు చేస్తారు. రవాణాకు ముందుగా ఎక్సైజ్, పోలీసుల కదలికలపై రెక్కీ నిర్వహిస్తారు. అనంతరం ద్విచక్ర వాహనాలపై దాన్ని తరలిస్తారు.



గంగంపాలెం అటవీ ప్రాంతంలో దాడిచేసిన సిబ్బంది

అశాస్త్రీయ పద్ధతి

అశాస్త్రీయమైన పద్ధతిలో సారా తయారు చేస్తారు. 200 లీటర్ల (డ్రమ్ము సారా) ఊట తయారీలో 15 కేజీల బెల్లం, ఒకటి, రెండు కేజీలు అమోనియాను ఉపయోగిస్తారు. దీనిలో 200 లీటర్ల నీటితో కూటిన ఊట సిద్ధమవుతుంది. దీన్ని నాలుగు నుంచి ఏడు రోజుల పాటు పులియ బెడతారు. శీతాకాలంలో నాలుగు రోజులకు, వేసవి కాలంలో వారం రోజులు పడుతుంది. ఆ పులిసిన ఊటను వేడి చేయడం ద్వారా ఆవిరితో సారా తయారవుతుంది.

విస్తృత దాడులు



సారా రహిత గ్రామాల సాధన కోసం విస్తృత దాడులు నిర్వహిస్తున్నాం. కోరుకొండ సర్కిల్ పరిధిలో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో చేసిన దాడుల్లో 42 మందిపై 40 కేసులు నమోదు చేశాం. నిందితుల నుంచి 1,200 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నాం. 30,600 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశాం. సారా నిర్మూలనలో భాగంగా పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నాం.

– జె.శ్రీనివాస్ బాలాజీ, సీఐ, కోరుకొండ, ఎక్సైజ్ శాఖ

రోగాల బారిన యువత



సారా కారణంగా గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా యువకులు దీనికి బానిసలై ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. ఒక్కోసారి పరిస్థితి విషమించి మృత్యువాత పడిన సంఘటనలు కూడా జరుగుతున్నాయి. సారా వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి. తయారీదారులు, సరఫరా చేస్తున్నవారు, విక్రేతలపై కేసులు నమోదు చేయాలి.

– ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి, ఎంపీపీ, కోరుకొండ

రీసర్వేకు భూ రికార్డులు అందించాలి

సీతానగరం: మిర్తిపాడులో నిర్వహించే రీసర్వేకు రైతులు తమ భూమి రికార్డులను అందించాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం ఆ గ్రామంలో సభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ దస్తావేజులు, లింక్ డాక్యుమెంట్లు, ఆధార్, బ్యాంక్, పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్సులను సంబంధిత అధికారులకు అందించాలన్నారు. మొదటిగా విలేజ్ బౌండరీలు సర్వే చేసి, విడగొట్టడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ భూములను గుర్తిస్తామన్నారు. భూ సర్వేకు నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశామని, ఈ నెల 20 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వచ్చే నెలాఖరుకు ప్రభుత్వ భూములు గుర్తించడం పూర్తవుతుందని, అనంతరం ప్రైవేటు భూముల రీసర్వే జరుగుతుందన్నారు. రైతులు ముందుగా తమ భూమి సరిహద్దులు చూపాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సునీత, రీసర్వే డీటీ మూర్తి, సర్వేయర్ గౌతమ్, వీఆర్వో కుమారి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి



గంగారావు

రంగంపేట: అస్వస్థకు లోనై ఉపాధి కూలీ మృతి చెందినట్టు ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జి ఏపీఓ వైఎస్. రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ముకుందవరం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా కాలువ పని చేస్తుండగా కురుకూరి గంగారావు (54) అనే ఉపాధి కూలీ గురువారం ఉదయం కళ్లు తిరుగుతున్నాయని చెప్పడంతో మేట్ గణేష్ అతడిని పని ప్రదేశంలోని మరో ఉపాధి కూలీ సహాయంతో ఇంటికి పంపించారు. అతని బంధువులు స్థానిక ఆర్ఎంపీ వైద్యుని దగ్గరకు తీసుకుని వెళ్లగా ఆయన ప్రథమ చికిత్స చేసి పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. బంధువులు పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే గంగారావు మృతి చెందినట్టు ఆసుపత్రి వైద్యులు ధృవీకరించారు.

ఉత్సాహంగా ఎస్ఎంసీ శిక్షణ



సభ్యులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్న డీఆర్పీలు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో గురువారం మండల స్థాయి ఎస్ఎంసీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం కోసం అనేక విషయాలను వివరించారు. మండలంలోని ప్రతి పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు, ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ హాజరయ్యారు. కో ఆర్డినేటర్‌గా ఎంఈవో కె.స్వామి నాయక్, డీఆర్పీలు కేఎల్ మనోహర్, డి.సత్యనారాయణ, ఎ.ప్రసాద్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక విధానం, విధులు, బాధ్యతలు, ఆరోగ్యం, పరిశుభ్రత, పారిశుధ్య, బడి బయట పిల్లలు - విద్యా సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం, టాయిలెట్ నిర్వహణ నిధి, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, పాఠశాల సామాజిక తనిఖీపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవో స్వామి నాయక్ మాట్లాడుతూ ఈ నెల మూడు నుంచి ఆరో తేదీ మధ్య పాఠశాల స్థాయిలో ఎస్ఎంసీ సమావేశం ఏర్పాటు చేసి, ఇక్కడ నేర్చుకున్న అన్ని విషయాలను సభ్యులకు తెలియజేయాలన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



ఈలకొలనులో గర్భిణులకు సామూహిక సీమంతాలు

రంగంపేట: ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ కోరారు. రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వడిశలేరు సెక్టార్ ఈలకొలను అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్త హీనతను నివారించవచ్చన్నారు. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఐసీడీఎస్ పీఓ జె. జెస్సీ ఫ్లోరెన్స్ గర్భిణులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ షేక్ గుల్జార్ బేగం, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, సెంటర్ పరిధిలోని గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పాటు పడాలి



బిక్కవోలు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కమిటీ సభ్యులు



రంగంపేట హైస్కూల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

రంగంపేట: పాఠశాల అభివృద్ధికి చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు సమిష్టిగా పాటు పడాలని మండల విద్యాశాఖాధికారి–1 కోసు శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈఓ–2 మధుసూదనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయుల ఒక్కరోజు శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, దాతల సహకారంతో పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, విద్యార్థుల సంఖ్యను పెంచడంలో అందరి సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాల విద్యాభివృద్ధికి వినియోగించాలన్నారు. 17 గ్రామాల నుంచి 48 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

యాజమాన్య కమిటీల పాత్ర కీలకం

బిక్కవోలు: పాఠశాల నిర్వహణ, అభివృద్ధిలో యాజమాన్య కమిటీల సహకారం ఎంతో అవసరమని మండల విద్యాశాఖ అధికారులు సత్యనారాయణ, పూర్ణచంద్రరావులు అన్నారు. గురువారం మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీలు, హెచ్ఎంలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ శిక్షణలో అంశాలపై అవగాహన పెంపొందించుకొని ఆయా పాఠశాలల పరిధిలో యాజమాన్య కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు.

యాజమాన్య కమిటీలకు శిక్షణ

పెదపూడి: మండల పరిషత్ కార్యాలయం వద్ద పాఠశాల యాజమాన్య కమిటీలు, పాఠశాలల హెచ్ఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. హాజరైన ఈవోపీఆర్డీ కేఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు పరచాలన్నారు. ఎంఈవో సత్యనారాయణ మాట్లాడారు. డీఆర్పీలు మనేశ్వరరావు, వీరభద్రం, గంగాభవానీలు శిక్షకులుగా వ్యవహరించారు.

ప్రణాళికాబద్ధంగా పనులు

రాజమహేంద్రవరం సిటీ: రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నగర అభివృద్ధే లక్ష్యంగా నగరపాలక సంస్థ పనిచేస్తోందని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఈ మేరకు గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న పుష్కరాలకు సంబంధించి రెండు పర్యాయాలు ఉన్నతస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. 2027లో జరిగే పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఘాట్ల విస్తరణ, కొత్త ఘాట్ల ఏర్పాటు, ఘాట్లకు వచ్చే దారిలో రోడ్ల విస్తరణ, డ్రైనేజీలు తదితర అంశాలపై దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. రోడ్ల విస్తరణకు సంబంధించి స్థానికుల అంగీకారాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. కార్పొరేషన్ ఆదాయం పెంచుకోడానికి తగిన మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే క్వారీ ఏరియాలో పెట్రోలు బంకు ప్రారంభించామని, అలాగే గ్రీన్ బాండ్లు జారీ చేయాలని కూడా నిర్ణయించామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే గ్రీన్ బాండ్లు జారీ చేస్తామన్నారు. ఆస్తి పన్ను బకాయిలు, ఖాళీ స్థలాల పన్నుల వసూలుపై దృష్టి పెట్టడంతో రూ.58 కోట్ల రెవెన్యూ వచ్చిందన్నారు.

బిక్కవోలు మండలంలోని అధికారులు వివరాలు

పేరు	హోదా	ఫోన్ నంబర్
వి. శ్రీనువాస్	ఎంపీడీవో	9848496088
ఎస్.జాన్ మిల్టన్	పంచాయతీ విస్తరణాధికారి	9110394865
–	తహసీల్దార్	9849903913
బీబీఎస్‌వీవీ కృష్ణ	డిప్యూటీ తహసీల్దార్	9866484845
యువై రత్నం	అసిస్టెంట్ ఇంజినీర్, పంచాయతీరాజ్	7036977405
ఎస్ సామ్యూల్ జాన్	వ్యవసాయ శాఖ ఏవో	8331056572
సీహెచ్‌వీవీ సత్యనారాయణ	మండల విద్యాశాఖ–1	9394222224
కె.పూర్ణచంద్రరావు	మండల విద్యాశాఖ -2	7981174295
కె.సాయి కుమార్	ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్	9111199576
రాంబాబు	ఏఈ, రోడ్డు భవనాల శాఖ	6301327292
ఏ.సరోజ	ఏఈఈ, నీటి పారుదల శాఖ, బిక్కవోలు	9885133949
కె.బుజ్జిదొర	ఏఈ, విద్యుత్ శాఖ	9440812650
వి.వనమయ్య	ఏఈ, హౌసింగ్	7093930486
వి.రవిచంద్ర కుమార్	ఎస్సై	9440904851
డాక్టర్ ప్రణీత్	వెటర్నరీ వైద్యులు, బిక్కవోలు	9494240289
డాక్టర్ దుర్గాదేవి	పీహెచ్‌సీ వైద్యులు, బిక్కవోలు	8008540157
డాక్టర్ విజయలక్ష్మి	పీహెచ్‌సీ వైద్యులు, కొంకుదురు	6303221241
అగస్టీన్	ఏపీవో ఉపాధిహామీ	7093998252
టి.సుప్రియ	ఏపీఎం వెలుగు	7993325064
శాంతి	ఐసీడీఎస్ సూపర్‌వైజర్, బిక్కవోలు	9177060757
కృష్ణవేణి	ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఊలపల్లి సెక్టార్	6305213882

బ్రహ్మాండ నాయకునికి ప్రణమిల్లిన భక్తజనం



బలభద్రపురంలో గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు




కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తజనం

- అంగరంగ వైభవంగా చివరి రోజు గ్రామోత్సవం
- ముత్తయిదువులతో స్వామికి జలాభిషేకం
- నేత్రానందంగా గోదాదేవి కల్యాణం



పుష్కరిణి చక్రస్నానంలో పాల్గొన్న భక్తులు



రథంపై ఊరేగుతున్న స్వామివారు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజు గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం సుప్రభాత సేవ, లఘు అర్చన, తోమాలసేవ నిర్వహించారు. అనంతరం 1,008 మంది ముత్తయిదువులతో స్వామివారికి గోదావరి జలాలతో అభిషేకం చేశారు. పంచామృతాభిషేకం చేసిన పిదప స్వామివారికి అలంకరణ చేశారు. చక్రస్నానంలో భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు. గోదాదేవి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కేరళ డప్పులు, సన్నాయి మేళాల మధ్య రథంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. సుమారు 25 వేల మందికి పైగా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, కమిటీ సభ్యులు నల్లమిల్లి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మోసం

రాజమహేంద్రవరం రూరల్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద డబ్బులు తీసుకుని, మోసం చేశారని హుకుంపేటకు చెందిన కోసూరి రిషిరేఖ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమెకు తుని ప్రాంతానికి చెందిన అప్పారావు ద్వారా చెరుకూరి శ్రీనివాసరావు పరిచయం అయ్యాడు. తనకు ఒక కేంద్ర మంత్రి తెలుసునని, ఆయన పలుకుబడిని ఉపయోగించి రూ.60 వేల జీతంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో అతడి బ్యాంకు ఖాతాలో ఒకసారి రూ.61 వేలు, మరోసారి రూ.28 వేలు రిషి రేఖ పంపించింది. అనంతరం ఉద్యోగం వేయించక పోగా, తీసుకున్న డబ్బులను చెరుకూరి శ్రీనివాసరావు తిరిగి ఇవ్వలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: పెన్నులను కొనేందుకు ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగి ఇంటికి రాలేదని లాలాచెరువు బత్తిన నగర్‌కు చెందిన టి.అరుణ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె 16 ఏళ్ల కుమార్తె గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో పెన్నులు కొనుక్కుంటానని చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఎస్సై ఆర్.అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.